

సీఎం కేసీఆర్ పోటీచేస్తున్న కామారెడ్డిలో మంగళవారం మంత్రి కేటీఆర్ నిర్వహించిన రోడ్‌షోకు పోటెత్తిన ప్రజలు

# మళ్లీ తెలంగాణే గెలవాలి

## దశాబ్దాల కష్టాలు, కన్నీళ్లు తొలగించాం • ప్రేమతో ప్రజాపాలన సాగించాం: కేటీఆర్

- కర్ణాటక సంచులతో కాంగ్రెస్ ఓట్ల వేట
- ఆ పార్టీతో మనం 50 ఏండ్లు గోసపడ్డం
- గ్యారెంటీలను నమ్మితే నిండా మోసపోతం
- స్వీయ రాజకీయ అస్తిత్వమే శ్రీరామరక్ష
- ఎట్లుండె తెలంగాణ ఇప్పుడెట్లయింది?
- ప్రజలంతా ఆలోచించి ఓటు వేయాలి
- కామారెడ్డి, సిరిసిల్ల రోడ్‌షోలు, మీడియా సమావేశంలో మంత్రి కేటీఆర్

నిజామాబాద్ (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ రాజన్న సిరిసిల్ల, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ తెలంగాణే గెలవాలని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణను గెలవాలని కాంగ్రెస్, బీజేపీ ఆరాటపడుతున్నాయని, కానీ, తెలంగాణే గెలవాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. మంగళవారం కామారెడ్డి, సిరిసిల్లలో నిర్వహించిన రోడ్‌షోల్లో కేటీఆర్ పాల్గొన్నారు. సిరిసిల్లలోని తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడారు. 'తెగించి పోరాడి తెచ్చుకున్న తెలంగాణను బాగుచేసుకునే బాధ్యతను ప్రజలు మాకు అప్పజెప్పారు. మెదళ్లను కరిగించి, ప్రాణాలను పణంగా పెట్టి పనిచేశాం. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకున్నం. దశాబ్దాల కష్టాలు, కన్నీళ్లు, బాధలు, వేదనలు తొలగిపోయి ప్రజలు కడుపునిండా తిని, కంటినిండా నిద్రపోయే

> *70 ఏండ్ల చరిత్రలో తెలంగాణ ఎన్నో పార్టీలను గెలిపించింది. కానీ, తెలంగాణను గెలిపించిన పార్టీ బీఆర్ఎస్ ఒక్కటే!* - మంత్రి కేటీఆర్

రోజులు తీసుకురావాలని ప్రేమతో పరిపాలన సాగించాం' అని తెలిపారు. ఇటు పక్క సర్వసమర్థుడు, దమ్మున్నవాడు. దార్శనికుడు సీఎం అభ్యర్థిగా ఉన్నారని.. అటు పక్క జోకర్లు, బ్రోకర్లు, బఫూన్లు ఉన్నారని ధ్వజమెత్తారు. తెలంగాణకు స్వీయ రాజకీయ అస్తిత్వమే శ్రీరామరక్ష అని స్పష్టం చేశారు.

### తెలంగాణకు కర్ణాటక డబ్బు సంచులు

కర్ణాటక డబ్బు సంచులతో తెలంగాణలో ఓట్ల వేటకొచ్చారని కాంగ్రెస్‌పై కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్‌ను దేశమంతా విస్తరింపజేస్తున్నారన్న కుట్రతో కేసీఆర్ గొంతునొక్కేందుకు రాహుల్‌గాంధీ, మోదీ కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఢిల్లీ చేతిలో కీలుబొమ్మలు తెలంగాణ ప్రయోజనాలను కాపాడలేరని తేల్చి చెప్పారు. తెలంగాణను కాంగ్రెస్ 50 ఏండ్లు ఏడిపించిందని, రాచిరంపాన పెట్టి, మన రక్తం తాగిందని ఫైరయ్యారు. కాంగ్రెసోళ్ల సీటుకే గ్యారెంటీ లేదని, వాళ్లిచ్చే గ్యారెంటీలకు దిక్కుంటదా? అని ప్రశ్నించారు. 'మూడు గంటల కరెంటు ఇస్తం. 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోండి. కౌలు రైతుకు పైసలిస్తే అసలు రైతుకు ఇవ్వం అని కాంగ్రెస్ అంటున్నది. ధరణి పోర్టల్ ఎత్తేస్తమంటూ ఓపెన్‌గా చెప్తున్నది. తెలిసి తెలిసి బొందలో పడదామా? ప్రజలు ఆలోచించాలి' అని విజ్ఞప్తి చేశారు.

> *బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, బోదకాలు, డయాలసిస్ బాధితులకు పింఛన్లు ఇవ్వాలని కేసీఆర్ కాకుండా ఏ సీఎం అయినా ఆలోచన చేశారా? కంటి పరీక్షలు చేసి, కండ్లద్దాలు ఇవ్వాలన్న మానవీయ ఆలోచన ఎవరికైనా వచ్చిందా?* - మంత్రి కేటీఆర్

## తిరుపూర్‌తో పోటీపడేలా సిరిసిల్ల

'మీ బిడ్డగా తల ఎత్తుకుని గర్వపడేలా సిరిసిల్లను అభివృద్ధి చేశా. జిల్లాను చేయడమే కాకుండా మెడికల్ కళాశాల, వ్యవసాయ, పాలిటెక్నిక్, నర్సింగ్ కళాశాలలు తీసుకొచ్చా. సిరిసిల్లను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా పెద్ద పెద్ద పరిశ్రమలను తెప్పించాలన్నది నా లక్ష్యం' అని సిరిసిల్ల రోడ్‌షోలో మంత్రి కేటీఆర్ అన్నారు. మధ్యమానేరులో దేశంలోనే అతిపెద్ద ఆక్వాహబ్‌ను, వర్కర్ టు ఓనర్ పథకం త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. తిరుపూరుతో పోటీపడేలా ఇక్కడి వస్త్ర పరిశ్రమ అభివృద్ధి కావాలని, ఆ దిశగా తాను ప్రయత్నం చేస్తానని వెల్లడించారు. వందేండ్లు చెప్పుకునేలా సిరిసిల్లను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. సిరిసిల్ల, కామారెడ్డి రహదారిని నాలుగు వరసలుగా మారుస్తానని చెప్పారు. ఐటీ రంగాన్ని తప్పకుండా తీసుకువస్తానని, త్వరలోనే రైలు కూత వినిపిస్తానని అన్నారు. 'సిరిసిల్ల మళ్లీ ఉరిసిల్ల అయ్యే మార్పు కావాలా? నేతన్నలు, రైతులు ఆత్మహత్యలు చేసుకునే మార్పు కావాలా? రైతులకు 24 గంటలు పోయి 3 గంటల కరెంటు వచ్చే మార్పు కావాలా? రైతుబంధు రద్దయ్యే మార్పు కావాలా? ఏ మార్పు కావాలో ఆలోచించాలి' అని ప్రజలను కోరారు.

> *మాకంటే ఎక్కువగా తెలంగాణను ఎవరు ప్రేమించలేరు. మాకున్న ఆపేక్ష, ఆత్మీయత ఇంకే పార్టీకీ ఉండదు. తెలంగాణ ప్రజలతో మాది పేగు బంధం. విడదీయరాని అనుబంధం* - మంత్రి కేటీఆర్

### ఆగమైతే గోసపడ్తం

'స్వరాష్ట్రంలో పాలమూరు వలసలు ఆగాయా? లేదా? పక్క రాష్ట్రాల కూలీలు వచ్చి మన పొలాల్లో నాట్లు వేస్తున్నారా? లేదా? నల్లగొండ గుండె మీద ఫ్లోరైడ్ బండ దిగిపోయిందా? లేదా? విషం నీళ్ల పీడ

> *తెలంగాణలో ఎక్కడ ఏ వాగు ఉన్నదో, ఏ వంక, డొంక ఎక్కడున్నదో సమగ్రంగా తెలిసిన నాయకుడు కేసీఆర్. సాధించింది చాలా ఉన్నది. సాధించాల్సింది ఇంకా ఉన్నది* - మంత్రి కేటీఆర్

విరగడై స్వచ్ఛమైన భగీరథ జలాలతో గొంతులు తడుస్తున్నాయా? లేదా? నేతన్నల ఆత్మహత్యల ఉరిసిల్లను సిరిసిల్లగా మారి విషాదం ఆగిందా? లేదా? మనం ఇచ్చిన కరెంటుతో పంటలు పండుతున్నది నిజం కాదా? ఎండిపోయిన చెరువులు నిండుకుండల్లా మారి మండుటెండల్లో మత్తుళ్లు దూకుతున్నయా? లేదా?దొంగరాత్రి మోటర్లు పెట్టబోయి పాములు కుట్టి, షాకులు కొట్టి రైతన్నలు సచ్చిపోయిన పాడు రోజులు మళ్లీ రావాలా?' అని ప్రజలను కేటీఆర్ అడిగారు. తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, ఐటీ ఉద్యోగాల్లో బెంగళూరును వెనక్కి నెట్టి హైదరాబాద్‌ను నం.1 చేశామని తెలిపారు. తెలంగాణ దుఃఖానికి సింబల్‌గా ఉన్న ప్రతి చిత్రం మారిందని వెల్లడించారు.

### గులాబీదే హ్యాట్రిక్

ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్‌దే గెలుపు అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టడం పక్కా అని స్పష్టం చేశారు. ఈ రెండు రోజులు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. సోషల్ మీడియాలో మాయామశ్చీంద్రగాళ్ల న్యూస్‌లు, ఫేక్ ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎంపీ బీబీ పాటిల్, బీఆర్ఎస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, టీఎస్‌టీపీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

> *పడావుపడ్డ భూములు, పాడుబడ్డ ఇండ్లు, ఆకలి కేకలు, ఆత్మహత్యలు, వలసలు, కరువులు, కర్ఫ్యూలు, ఎన్‌కౌంటర్లు, కరెంటు కోతలు, కటిక చీకట్లతో అల్లాడిన తెలంగాణ ఇప్పుడెట్లున్నదో ప్రజలకు తెలుసు* - మంత్రి కేటీఆర్

## ఢిల్లీ మెడలు వంచిన రోజు

- నేడు తెలంగాణ దీక్షా దివస్
- నవంబర్ 29కి ప్రత్యేక గుర్తింపు
- దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించాలి
- పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పిలుపు

*హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ చరిత్రను మలుపుతిప్పిన నవంబర్ 29వ తేదీకి ప్రత్యేక స్థానం ఉన్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కల్వకుంట్ల తారాకరామారావు అన్నారు. ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ సాధించిన రోజు నవంబర్ 29కి ప్రత్యేక గుర్తింపు ఉందని చెప్పారు. హైదరాబాద్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎత్తిన జెండా దించకుండా తెలంగాణను సాధించిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని తేలేకపోతే రాళ్లతో కొట్టిచంపండి అని ధైర్యంగా చెప్పింది కేసీఆర్ అని గుర్తుచేశారు. ఆమరణ నిరాహారదీక్షతో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా కేసీఆర్ తెగించి పోరాడి తెలంగాణ సాధించారని చెప్పారు. ఈ క్రమంలోనే నవంబర్ 29న ప్రతి సంవత్సరం తెలంగాణలో దీక్షా దివస్‌ను జరుపుకుంటున్నామని అన్నారు. ఈ సంవత్సరం సైతం దీక్షా దివస్‌ను బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమాన్ని కాంగ్రెస్ పార్టీ అడుగడుగునా అడ్డుకున్నదని విమర్శించారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలు, కేసీఆర్ పోరాట స్ఫూర్తిని దీక్షా దివస్ ద్వారా వ్యాప్తిచేయాలని పిలుపునిచ్చారు.*

## కామారెడ్డి అభివృద్ధికి నాదే పూర్తి భరోసా

*కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకు వచ్చినట్టు కామారెడ్డి నియోజకవర్గం పరిస్థితి కూడా అదే విధంగా ఉండబోతున్నదని కామారెడ్డి రోడ్‌షోలో కేటీఆర్ అన్నారు. కామారెడ్డికి కేసీఆర్ వచ్చారంటే ఏమొస్తుందో ప్రజలంతా ఆలోచన చేయాలని కోరారు. ఈ ప్రాంతానికి గోదావరి జలాలను ఏడాది లోపు తీసుకొచ్చే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. 'కేసీఆర్ వచ్చాక కామారెడ్డికా తక్‌దీర్ బదల్ జాత. 55 ఏండ్లు ఒకెత్తు. ఈ ఐదేండ్లు ఒకెత్తు. కామారెడ్డి అభివృద్ధికి నేను బాధ్యత తీసుకుంటా' అని తెలిపారు. కామారెడ్డిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కావాలంటే బీఆర్ఎస్‌తోనే అవుతుందని వెల్లడించారు. ప్రతి వార్డులో ఒక మహిళా సమాఖ్య భవనం కట్టిస్తానని హామీ ఇచ్చారు. వారంకోసారి కామారెడ్డికి తప్పకుండా వస్తానని చెప్పారు. 30న ఎన్నికల్లో దమ్ము చూపాలె.. దుమ్ము రేపాలె.. అఖండ మెజార్టీతో కేసీఆర్‌ను గెలిపియ్యాలె అంటూ పిడికిలి బిగించి ప్రజలతో జై కొట్టించారు. బీజేపోడికి బుడ్డా పైసా తెచ్చే దమ్ముందా? అని ప్రశ్నించారు. మతం పేరిట బీజేపోడు రాజకీయం చేస్తుంటే, కాంగ్రెసోడు కులం పేరిట రాజకీయం చేస్తున్నాడని దుయ్యబట్టారు.*



కామారెడ్డిలో రోడ్‌షో నిర్వహిస్తున్న కేటీఆర్‌కు ఇండ్లపైనుంచి అభివాదం చేస్తున్న పట్టణవాసులు; చిత్రంలో ఎమ్మెల్యే గంప గోవర్ధన్ తదితరులు

# 58 ఏండ్లు అలా.. 9 ఏండ్లు ఇలా!

- అభివృద్ధిని చూసి 'కారు'కు ఓటెయ్యండి: మంత్రి కేటీఆర్
- 2014కు ముందు, తర్వాత అభివృద్ధిని పోల్చుతూ ట్వీట్
- ఆదిలాబాద్ నుంచి అచ్చంపేట దాకా కారు జోరు అని వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): గత పాలకుల 58 ఏండ్ల పాలనలో, తొమ్మిదేండ్ల కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి తేడాను గుర్తించి కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ కోరారు. కేసీఆర్ పాలనలో అన్ని రంగాల్లో తెలంగాణ అనేక విజయాలు నమోదు చేసిందని వెల్లడించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా.. 'గత తొమ్మిదేండ్లలో జరిగిన అభివృద్ధి, అంతకు ముందు 58 ఏండ్లలో జరిగిన పనులను చూడండి. అభివృద్ధికి ఓటెయ్యండి. కారు గుర్తుకు ఓటెయ్యండి' అని ట్వీట్ చేశారు. గతంలో 11 దఫాలు కాంగ్రెస్, టీడీపీ పాలనలో జరిగిన పనులు, రెండు దఫాల్లో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని వివరించారు. ఆదిలాబాద్ నుంచి అచ్చంపేట దాకా, సిర్పూర్ నుంచి అలంపూర్ దాకా, భద్రాచలం నుంచి జహీరాబాద్ దాకా, తాండూరు నుంచి చెన్నూర్ దాకా, మధిర నుంచి ముథోల్ దాకా, మక్తల్ నుంచి జుక్కల్ దాకా కారు జోరు కొనసాగుతున్నదని, మళ్లీ కేసీఆర్ సర్కారే రానున్నదని ధీమా వ్యక్తం చేశారు. వివిధ రంగాల్లో గతంలో జరిగిన పనులు, గత తొమ్మిదేండ్లలో సాధించిన ప్రగతితోపాటు వచ్చే ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే చేపట్టనున్న కొత్త పథకాలను వివరించారు.

### 2014కు ముందు, 2014 తర్వాత అభివృద్ధి ఇలా..

| రంగం | 2014కు ముందు | 2014 తర్వాత |
|---|---|---|
| వ్యవసాయానికి విద్యుత్తు | 6 గంటలు | 24 గంటలు |
| సాగులో ఉన్న భూమి | 131 లక్షల ఎకరాలు | 268 లక్షల ఎకరాలు |
| వరిధాన్యం ఉత్పత్తి | 68 లక్షల టన్నులు | 3.5 కోట్ల టన్నులు |
| పంటల దిగుబడి | 150 లక్షల టన్నులు | 362 లక్షల టన్నులు |
| తలసరి ఆదాయం | రూ.1,24,104 | రూ.3,17,115 |
| ఐటీ ఎగుమతులు | రూ.57,258 కోట్లు | రూ.2,41,275కోట్లు |
| ఐటీ ఉద్యోగాలు | 3,23,396 | 10,00,000 |
| విద్యుత్తు ఉత్పత్తి | 7,778 మెగావాట్లు | 18,567 మెగావాట్లు |
| రిజర్వాయర్ల సంఖ్య | 41 | 157 |
| రోడ్ల పొడవు (2లేన్లు, 4లేన్లు) | 6,762 కి. మీ. | 13,214 కి. మీ. |
| మెడికల్ కాలేజీలు | 5 | 34 |
| ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్స్ | 293 | 1022 |
| దవాఖానల్లో బెడ్లు | 18,400 | 68,000 |
| ప్రసూతి మరణాల రేటు | 92 | 43 |
| శిశు మరణాల రేటు | 39 | 21 |
| పేదరిక జనాభా | 13.18 శాతం | 5.8 శాతం |
| ఫ్లైఓవర్ల నిర్మాణంతో తొలగించిన ఇండ్లు | 967 | 0 |

**మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక చేపట్టే ముఖ్యమైన కార్యక్రమాలు**

| రైతుబంధు ప్రతి ఎకరానికి పెంపు | పేదలకు గ్యాస్ సిలిండర్ | ఆసరా పెన్షన్ల పెంపు నెలకు | ప్రతి మహిళకు సౌభాగ్య లక్ష్మి కింద నెలకు |
|---|---|---|---|
| రూ.16,000 | రూ.400 | రూ.5,016 | రూ.3,000 |

| అన్నపూర్ణ పథకం కింద తెలుపు రంగు రేషన్‌కార్డుదారులకు: సన్నబియ్యం | కేసీఆర్ ఆరోగ్య రక్ష కింద ఆరోగ్య బీమా పెంపు | రూ.15 లక్షలు |
|---|---|---|

